సాక్షి మెదక్

మంగళవారం । 5 । మార్చి । 2024



ఎన్నాళ్లో గోదా'వరీ'

కరువు నేల హుస్నాబాద్ మెట్ట ప్రాంతాన్ని గోదావరి జలాలు ఇప్పట్లో తాకేలా లేవు. రైతుల కష్టాలు తప్పేలా లేవు.

వివరాలు 8లో ▸



ఆయిల్‌పామ్ వైపు అడుగులు

ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. 25 ఏళ్లు రాబడి వచ్చే అవకాశం ఉండడంతో రైతులు మొగ్గు చూపుతున్నారు.

వివరాలు 8లో ▸



పనిచేయని అధికారులెందుకు?

సర్వసభ్య సమావేశానికి రేంజ్ ఆఫీసర్ గైర్హాజరు కావడం ఏమిటని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఉద్యోగుల హర్షం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: ఒకటో తేదీన జీతాలు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శాంసన్ జయాకర్, జలగం ప్రసాద్ మాట్లాడుతూ.. మార్చి నెల ఆర్థిక సంవత్సరం అయినప్పటికీ ఒకటో తేదీన జీతాలు ఇవ్వడం హర్షనీయమన్నారు. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాల్గవ తరగతి ఉద్యోగులు మురళి, సత్యనారాయణ, స్వప్న, ప్రసన్న, శకుంతల, యాదగిరి, పోచయ్య, రఫిక్, నాగరాజు, ఫరీద్, పాషా, మున్న తదితరులు పాల్గొన్నారు.

సమయం వృథా చేయొద్దు: డీఈఓ



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

వెల్దుర్తి(తూప్రాన్)/కొల్చారం: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ రాధాకిషన్ అన్నారు. సోమవారం వెల్దుర్తి ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించి సలహాలు, సూచనలు అందజేశారు. ఈనెల 18వ తేదీ నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో సమయం వృథా చేయొద్దని సూచించారు. ఆయన వెంట ఎంఈఓ యాదగిరి, హెచ్ఎం సాంబయ్య ఉన్నారు. అనంతరం కొల్చారం మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాలలో లోక్‌సభ ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా పాఠశాలలోని విద్యార్థులకు 'తెలంగాణ ఓటరు సంకల్ప పత్రాలను' డీఈఓ అందజేశారు.

పాఠశాల స్థలంపై ఫిర్యాదు



జెడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి ఉన్నత పాఠశాల క్రీడా స్థలంపై వివాదం కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా గ్రంథాలయ భవనానికి కేటాయించారంటూ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. కాగా పాఠశాల స్థలం అక్రమ గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేయాలంటూ సోమవారం జెడ్పీ సీఈఓ ఎల్లయ్యకు పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశం, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణాగౌడ్, యువకులతో కలిసి ఫిర్యాదు చేశారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని జెడ్పీ సీఈఓ హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్, శ్రవణ్‌కుమార్, శివశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై మోదీ యుద్ధం



మాట్లాడుతున్న మురళీగౌడ్

నర్సాపూర్: అవినీతికి పాల్పడే పార్టీలపై ప్రధాని నరేంద్ర మోదీ యుద్ధం చేస్తున్నారని బీజేపీ విజయ సంకల్ప సభ నియోజకవర్గ పరిశీలకుడు డాక్టర్ మురళీగౌడ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరులో మోదీ పాల్గొనే సభకు కార్యకర్తలను తరలించేందుకు గాను సోమవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రధాని దేశ రక్షకుడుగా ఉన్నారని, ఆయన చేపట్టిన పథకాలతో దేశం ప్రగతిబాటలో పయనిస్తుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ మాట్లాడుతూ.. మెదక్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌గౌడ్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు చిన్న రమేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సురేష్, రాజేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎదురుచూపులు!



'ఏడుపాయల'కు విడుదల కాని నిధులు

- రూ. 2 కోట్లతో ప్రతిపాదనలు
- మరో మూడు రోజుల్లో జాతర
- డోలాయమానంలో అధికారులు



ఏడుపాయలలో భక్తుల సందడి (ఫైల్)

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల జాతర సమీపిస్తున్నా ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. ఈనెల 8 నుంచి ప్రారంభం కానున్న జాతర కోసం అధికారులు రూ. 2 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గతంలో జాతర నిర్వహణ ఖర్చు దేవస్థానం భరించేది. ఉన్నంతలో సుమారు రూ. 40 లక్షల ఖర్చుతో ఏర్పాట్లు చేసేవారు. అయితే రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఏటా ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద నిధులు విడుదల చేస్తూ వస్తోంది. అయితే ఏటా జాతరకు 15 రోజుల ముందు నిధులు విడుదల అయ్యేవి. ప్రస్తుతం జాతర సమీపిస్తున్నా విడుదల కాకపోవడంతో అధికారులు అయోమయంలో పడ్డారు.

తెలంగాణలోనే ప్రసిద్ధిగాంచిన ఏడుపాయల వనదుర్గా ఆలయం వద్ద మహాశివరాత్రిని పురస్కరించుకొని మూడు రోజుల పాటు జాతరను వైభవంగా నిర్వహిస్తారు. సుమారు 10 లక్షల మంది వరకు భక్తులు హాజరవుతారు. ఏటా ప్రభుత్వం జాతర కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద నిధులు విడుదల చేస్తూ వస్తోంది. 2014–15లో రూ. 80 లక్షలు, 2015–16లో రూ.1.50 కోట్లు, 2016– 17లో రూ. 50 లక్షలు, 2017–18లో రూ.1.50 కోట్లు, 2018–19లో రూ.1.50 కోట్లు, 2019–20లో రూ.75 లక్షలు, 2020–21లో రూ.1 కోటి, 2021–22లో రూ.1 కోటి, 2022–23లో రూ. 2 కోట్ల నిధులు విడుదల చేశారు.

ఏర్పాట్లకు రూ. లక్షలు అవసరం

మరో మూడు రోజుల్లో జాతర ప్రారంభం కానుంది. అయినా ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. తొమ్మిదేళ్లుగా ఎస్‌డీఎఫ్ నిధులతో జాతర ఏర్పాట్లు బ్రహ్మాండంగా జరుగుతున్నాయి. ఆలయం ఎదుట మంజీర పాయల్లో శివుడి విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు ఆలయం చుట్టూ పూల అలంకరణ, రంగు రంగుల విద్యుత్ దీపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎల్ఈడీ స్క్రీన్‌లు, పెద్ద పెద్ద హోర్డింగ్‌లు, షామియానాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. ఇవన్నీ రూ. లక్షలతో కూడుకున్న పనులు. ఈసారి ఇంకా నిధులు విడుదల కాకపోవడంతో అధికారులు, పాలకవర్గం కొంత ఆందోళనకు లోనవుతున్నారు.

కొరవడిన సమన్వయం

ఏడుపాయల జాతర ఏర్పాట్లపై ఏటా మూడు, నాలుగు సార్లు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తారు. అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, అన్నిశాఖల అధికారులు సమీక్ష నిర్వహిస్తారు. కానీ ఈసారి సమావేశాలు మొక్కుబడిగా, ఆఘమేఘాల మీద నిర్వహించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫిబ్రవరి 15వ తేదీన మొదటి సమావేశం మెదక్‌లో నిర్వహించారు. 17న మరో సమావేశం నిర్వహించారు. అయితే సరైన సమాచారం లేకపోవడంతో ఏడుపాయల ఈఓ మోహన్ రెడ్డి, చైర్మన్ బాలాగౌడ్ సకాలంలో హాజరుకాలేకపోయారు. అదేవిధంగా ఈనెల 2వ తేదీన ఏడుపాయలలో నిర్వహించిన సమావేశంపై చైర్మన్, ఈఓకు ముందస్తు సమాచారం లేదని తెలుస్తోంది. మీడియా ప్రతినిధులకు అసలు సమాచారమే లేకుండా పోయింది. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సైతం మూడు సమావేశాలకు హాజరుకాలేకపోయినట్లు తెలుస్తోంది. అయితే సోమవారం నిర్వహించిన సమావేశానికి మాత్రం హాజరయ్యారు.

ప్రతిపాదనలు పంపాం

ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభం అయ్యే ఏడుపాయల జాతర కోసం ఎస్‌డీఎఫ్ కింద రూ. 2 కోట్లు మంజూరు చేయాల్సిందిగా ప్రతిపాదనలు పంపాం. త్వరగానే మంజూరు అవుతాయని భావిస్తున్నాం.

– కృష్ణయ్య, సీపీఓ

ప్రజావాణికి 134 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు, డీఆర్ఓ

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్ఓ పద్మశ్రీతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు వివిధ సమస్యలపై వినతులు అందజేశారు. మొత్తం 134 అర్జీలు రాగా పరిశీలించిన అదనపు కలెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ధరణికి సంబంధించిన దరఖాస్తులే అధికంగా రావడం గమనార్హం. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవిశ్వాసంపై ఉత్కంఠ

రేపు తూప్రాన్ మున్సిపల్ చైర్మన్‌పై తీర్మానం



తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం

తూప్రాన్: తూప్రాన్ మున్సిపల్ చైర్మన్‌పై బుధవారం అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టనున్నారు. 16 మంది కౌన్సిలర్లు ఉండగా.. చైర్మన్ రవీందర్‌గౌడ్‌పై అవిశ్వాసం ప్రకటించి నెలరోజులు కావొస్తుంది. కాగా బీఆర్ఎస్ నుంచి చైర్మన్‌తో పాటు మరో నలుగురు కౌన్సిలర్లు క్యాంపులో ఉన్నారు. అలాగే కాంగ్రెస్ నుంచి తొమ్మిది మంది, ఒకరు బీజేపీ కలిపి మొత్తం 10 మంది కౌన్సిలర్లు క్యాంపులో ఉన్నారు. కాగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 2వ వార్డు కౌన్సిలర్ మామిడి వెంకటేశ్ కాంగ్రెస్ కౌన్సిలర్లు నిర్వహిస్తున్న క్యాంపు నుంచి బయటకు వచ్చి రహస్య ప్రాంతానికి వెళ్లినట్లు తెలిసింది. రెండువర్గాల్లో కాకుండా మరో చోట ఉన్నారా..? లేదా తిరిగి బీఆర్ఎస్ వైపు వెళ్లారా..? అనేది ప్రశ్నార్థకంగా మారింది. అయితే అవిశ్వాసం నెగ్గేందుకు 11 మంది కౌన్సిలర్లు ఉండాలి. కాని 10 మంది మాత్రమే ఉండడంతో అవిశ్వాసం నెగ్గేనా..? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే పట్టణంలోని పుట్టకొట్టాల వద్ద కౌన్సిలర్ మామిడి వెంకటేశ్, మరో ఇద్దరు కౌన్సిలర్ల భర్తలు సత్యలింగం, తలారి మల్లేశం 2 వేల గజాల భూమిని ఒకే ఇంటి నంబరుతో అక్రమంగా ఇతరులకు విక్రయించినట్లు రెవెన్యూ అధికారుల విచారణలో తేలింది. ఇందులో 0.01 గుంట ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయంలో కాంగ్రెస్ కౌన్సిలర్ రవీందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కౌన్సిలర్, ఇద్దరు కౌన్సిలర్ భర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా కౌన్సిలర్‌ను సస్పెండ్ చేస్తే సులువుగా అవిశ్వాసం నెగ్గుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా నెల రోజుల ఉత్కంఠకు బుధవారం తెరపడనుంది.

జాతరను విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ కలెక్టరేట్: ఏడుపాయల వనదుర్గా భవాని జాతరను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జాతరపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా జాతర ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో శాఖల వారీగా మాట్లాడారు. 100 సీసీ కెమెరాలు, నాలుగు అంబులెన్స్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వికలాంగులు వృద్ధుల కోసం ప్రత్యేకంగా 20 వీల్‌చైర్లు ఏర్పాటు చేశామన్నారు. జాతర కోసం ప్రత్యేకంగా వైద్య శాఖను అలర్ట్ చేశామని చెప్పారు. దేవస్థానానికి 1,507 ప్రత్యేక బస్సులు, 8 మినీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రైతు వేదికల్లో ట్రయల్ రన్

6న వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభించనున్న సీఎం

రామాయంపేట(మెదక్): ఈనెల 6వ తేదీన జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన రామాయంపేట, నర్సాపూర్, కొల్చారం రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభం కానుంది. ఆరోజు ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని రామాయంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ తెలిపారు. దృశ్య శ్రవణం ద్వారా నేరుగా సీఎంతో మాట్లాడడానికి గానూ రామాయంపేటకు చెందిన ఇద్దరు రైతులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈమేరకు ముందస్తుగా సోమవారం వ్యవసాయశాఖ రాష్ట్ర అధికారులచే ట్రయల్ రన్ నిర్వహించినట్లు వివరించారు.

రెండో రోజు 2,781 మందికి పోలియో చుక్కలు

మెదక్ కలెక్టరేట్: జిల్లావ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి 2,781 మంది 5 ఏళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు డీఎంహెచ్ఓ చందునాయక్ తెలిపారు. దీంతో ఇప్పటివరకు 98 శాతం పల్స్ పోలియో పూర్తయినట్లు చెప్పారు. మిగిలిపోయిన చిన్నారులకు మంగళవారం సైతం వేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆడపిల్లలు పుట్టారని వేధిస్తున్నారు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ బాలస్వామి

ఎస్పీకి మహిళ ఫిర్యాదు

మెదక్ మున్సిపాలిటీ: ఇద్దరు ఆడపిల్లలు పుట్టారని వేధిస్తున్నారని మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేసింది. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీ బాలస్వామి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి అగ్రహారానికి చెందిన బోడపట్ల రేణుక ఎస్పీని కలిసి న్యాయం చేయాలని వేడుకుంది. తనకు 25 ఏళ్ల క్రితం కోనాపూర్‌కు చెందిన బోడపట్ల ఐలయ్యతో వివాహం జరిగిందని.. ఇద్దరు ఆడపిల్లలు పుట్టారని అత్త, మరిది, మామ భర్త నిత్యం వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై పెద్దల సమక్షంలో ఎన్నిసార్లు పంచాయతీ పెట్టిన తన భర్తలో మార్పు రావడం లేదని వాపోయింది. స్పందించిన ఎస్పీ చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయాలని చిన్నశంకరంపేట ఎస్ఐకి సూచించారు. అలాగే కౌడిపల్లి మండలం ధర్మసాగర్ తండాకు చెందిన గుగులోత్ మానిక ఎస్పీని కలిసింది. ఆరేళ్ల క్రితం టేక్మాల్ మండలం హసన్ మహమ్మద్‌పల్లికి చెందిన గుగులోత్ శ్రీనుతో వివాహం జరిగిందని.. పెళ్లి సమయంలో తల్లిదండ్రులు వరకట్నంగా బంగారం, వెండి, బైక్‌తో పాటు రూ. 30 వేల నగదు ఇచ్చి పెళ్లి చేశారని తెలిపింది. ఇద్దరు కొడుకులు ఉండగా నేను ఇంట్లో లేని సమయంలో మా తల్లిదండ్రులు పెట్టిన బంగారం వెండి ఆభరణాలను నా భర్త, అత్త, మరిది కలిసి అమ్ముకున్నారని ఫిర్యాదు చేసింది. అలాగే నన్ను, పిల్లలను ఇంటి నుంచి గెంటేశారని ఆవేదన వ్యక్తం చేసింది. బతుకు భారంగా మారిందని, న్యాయం చేయాలని ఎస్పీని వేడుకుంది. స్పందించిన ఎస్పీ బాధితులకు చట్టప్రకారం న్యాయం చేయాలని కౌడిపల్లి ఎస్ఐని ఆదేశించారు.

రైతులకు నష్టం కలిగించొద్దు

డీఏఓ గోవింద్



దగ్ధమైన చెరుకు పంటను పరిశీలిస్తున్న అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులకు ఎవరూ నష్టం కలిగించొద్దని డీఏఓ గోవింద్ అన్నారు. కౌడిపల్లి మండలం సదాశివపల్లి కనికల చెరువు కట్ట కింద దారి ధ్వంసం చేయడంతో రైతు చెరుకు పంటను దగ్ధం చేసుకున్న విషయం విదితమే. దీంతో సోమవారం జిల్లా అధికారులు స్పందించారు. డీఏఓ గోవింద్, తహసీల్దార్ ఆంజనేయులు, ఐబీ డిప్యూటీ ఈఈ జగన్నాథం, ఏఈ రవిమోహన్, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్‌రెడ్డి, ఆర్ఐ శ్రీహరి తదితరులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. చెరువు కట్టపై నుంచి సొంత డబ్బులతో వేసుకున్న దారిని సదాశివపల్లి మాజీ సర్పంచ్ వీరయ్య, గ్రామస్తులు కక్షపూరితంగా ధ్వంసం చేశారని రైతు కృష్ణాగౌడ్ అధికారులకు చెప్పారు. పరిశీలించిన అధికారులు గ్రామస్తులు, రైతులతో మాట్లాడారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ.. సమస్య ఉంటే అధికారులను సంప్రదించాలని, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. సంగారెడ్డి సమీపంలోని గణేష్ చెరువు ఫ్యాక్టరీ అధికారులకు ఫోన్ చేసి దగ్ధమైన చెరుకును క్రషింగ్ కోసం తీసుకోవాలని కోరారు. ఫ్యాక్టరీ అధికారులు సైతం దగ్ధమైన చెరుకు పంటను పరిశీలించారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్



మాట్లాడుతున్న ప్రణీద్‌కుమార్

రామాయంపేట(మెదక్): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్షుడు ప్రణీద్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం రామాయంపేటలో జరిగిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. పండిట్, పీఈటీల ప్రమోషన్ విషయమై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విధిగా పారిశుద్ధ్య కార్మికులను నియమించాలన్నారు. కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడం శుభ సూచకమని, ఈమేరకు సంఘం తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి మోహన్, జిల్లా నాయకులు నర్సింహారావు, రశీద్, విద్యాసాగర్, మండలాల అధ్యక్ష, కార్యదర్శులు నవీన్ రత్నాకర్, విఠల్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ

- ఎస్సీ స్టడీ సర్కిల్‌లో 5 నెలల ఫౌండేషన్ కోర్సు
- దరఖాస్తులకు రేపు ఆఖరు



మెదక్ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి వరుస నోటిఫికేషన్లు జారీ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఉద్యోగార్థులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ స్టడీ సర్కిళ్లు ఉచిత శిక్షణ ఇస్తున్నాయి. తాజాగా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో 5 నెలల ఫౌండేషన్ కోర్సు నిమిత్తం 100 సీట్ల భర్తీకి ఫిబ్రవరి 23న ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ప్రైవేట్ శిక్షణ కేంద్రాలకు వెళ్లే స్థోమత లేని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం విస్తృత ప్రచారం కల్పిస్తోంది. గ్రూప్స్, బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌తో పాటు ఇతర పరీక్షల కోసం రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ అందజేస్తుంది. సంబంధిత వెబ్‌సైట్‌లో ఈనెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

10న ప్రవేశ పరీక్ష

నిష్ణాతులైన బోధకుల ద్వారా తరగతుల నిర్వహణతో పాటు రూ.1,500 విలువైన స్టడీ మెటీరియల్ అందజేస్తారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు స్కాలర్‌షిప్ రూ. 5 వేలు, భోజన ఖర్చుల కింద రోజుకు రూ.75 చొప్పున, నెలకు రూ. 2,250 వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. గ్రూప్–1 శిక్షణకు మార్చి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఇచ్చారు. ఈనెల 10వ తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షలో అర్హత పొందిన 100 మందికి మార్చి 18 నుంచి ఆగస్టు 17 వరకు ఉచిత భోజన వసతి, సౌకర్యాలతో శిక్షణ ఇస్తారు. గత రెండేళ్లుగా స్టడీ సర్కిల్‌లో 125 మంది అభ్యర్థులు శిక్షణ పొందారు. ప్రస్తుతం 3వ బ్యాచ్ కోసం దరఖాస్తులు స్వీకరణ కొనసాగుతోంది. మరిన్ని వివరాలకు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి అధికారి కార్యాలయంలో సంప్రదించాలని జిల్లా అధికారిణి విజయలక్ష్మి సూచించారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



మెడల్స్‌తో విద్యార్థులు

గజ్వేల్ : హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడలో 3వ తేదీన జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో గజ్వేల్‌కు చెందిన బుడోకాన్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన శ్రీజ, స్వాతి వెండి పతకాలు, నలంద పాఠశాలకు చెందిన నర్సింహ వెండి పతకం, దేవాన్ష్ కాంస్య పతకం, వర్గల్ మండల శాకారం గ్రామానికి చెందిన వంశీ బంగారు పతకాలను సాధించారు. వీరిని ఆయా పాఠశాలల యాజమాన్యాలు, కరాటే అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరేష్ అభినందించారు.

వర్గల్(గజ్వేల్): రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో వర్గల్ జెడ్పీహైస్కూల్ విద్యార్థి అభిలాష్ (9వ తరగతి) చక్కని ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా సోమవారం వర్గల్ హైస్కూల్‌లో అభిలాష్‌ను, కోచ్ వంశీని హెచ్‌ఎం వెంటేశ్వర్‌గౌడ్ అభినందించి సన్మానించారు.

జాతీయ క్రీడలకు ఎంపిక





అనూష రవళి

చేర్యాల(సిద్దిపేట) : ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ పట్టణంలో 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా తరఫున మండల పరిధిలోని ఆకునూరుకి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు జిల్లా హ్యాండ్ బాల్ కార్యదర్శి ఎండీ.రఫత్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆకునూరుకు చెందిన హ్యాండ్ బాల్ క్రీడాకారిణి తుంగ అనూష (గోల్ కీపర్), గూడూరు రవళి పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మేర్గ శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు.


దుబ్బాక విద్యార్థుల హవా



పతకాలతో విద్యార్థులు

దుబ్బాక: ఇన్విటేషన్ నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ షిప్ కరాటే పోటీల్లో దుబ్బాక పట్టణ విద్యార్థులు పతకాలు సాధించినట్లు యువ స్పోర్ట్స్ కరాటే అకాడమీ తెలంగాణ వ్యవస్థాపకుడు, స్టైల్ చీఫ్ మాస్టర్ బురానీ శ్రీకాంత్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. విక్టరీ షోతోకన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్యారడైస్ గార్డెన్‌లో రాష్ట్ర స్థాయి కరాటే కుంగ్ ఫూ చాంపియన్ షిప్ పోటీలు జరిగినట్లు తెలిపారు. ఇందులో దుబ్బాక పట్టణానికి చెందిన 21 మంది విద్యార్థులు పాల్గొని 5 గోల్డ్ మెడల్స్, 4 సిల్వర్స్, 11 బ్రొంజ్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. పథకాలను సాధించిన విద్యార్థులను డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఈజీసీఓ ముక్తేశ్వరి అభినందించినట్లు తెలిపారు.

ఎన్నాళ్లీ గోదావరి!



గౌరవెల్లి ప్రాజెక్టు

కరువు నేల హుస్నాబాద్ మెట్ట ప్రాంతాన్ని గోదావరి జలాలు ఇప్పట్లో తాకేలా లేవు. ఇక్కడి రైతుల కష్టాలను తీర్చాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007లో గౌరవెల్లి, గండిపెల్లి రిజర్వాయర్లను నిర్మించడానికి శంకుస్థాపన చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రాజెక్టులకు రీ డిజైన్ చేసిన కొత్త ప్రభుత్వం పనులు మొదలు పెట్టి 95 శాతం పూర్తి చేసింది. అధికారులు 2023 జూలైలో ట్రయల్ రన్ చేసి నాలుగు రోజులు ప్రాజెక్టులకు గోదావరి జలాలను వదిలారు. ఇంతలోనే గ్రీన్ ట్రిబ్యూనల్‌లో కేసు ఉందని పనులను నిలిపేశారు. దీంతో పంటలకు నీళ్లు లేక ఎండిపోతుండడంతో రైతులు నానా కష్టాలు పడుతున్నారు.

– హుస్నాబాద్‌రూరల్

మెట్ట నేలను తాకని గోదావరి జలాలు

- గౌరవెల్లి, గండిపెల్లి రిజర్వాయర్లు నీళ్లు లేక వెలవెల
- ఎండిపోతున్న ఆయకట్టు పంటలు
- పక్షంలో అడుగంటిన భూగర్భజలాలు
- నీళ్ల కోసం భగీరథ ప్రయత్నాలు
- దిక్కుతోచని స్థితిలో రైతులు

హుస్నాబాద్ ఉమ్మడి మండలం గుడాటిపల్లిలో ఇందిరమ్మ వరద కాల్వలకు అనుసంధానంగా నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణంతో వరంగల్, జనగామ, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలోని 1.60 లక్షల ఎకరాలకు 2 పంటలకు సాగు నీరు రాబోతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణంకు 3,845.17 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా ఇప్పటి వరకు 3,487.16 ఎకరాల భూమిని సేకరించారు. మరో 40 ఎకరాల భూమి సేకరిస్తే భూ సేకరణ పూర్తి అవుతుంది. గండిపెల్లి ప్రాజెక్టులో 1 టీఎంసీ, గౌరవెల్లి ప్రాజెక్టులో 8.23 టీఎంసీల నీరును రెండు దఫాలు నింపితే 1.60 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇచ్చే అవకాశం ఉంటుంది. వచ్చే ఖరీఫ్ వరకు మిడ్‌మానేరు నుంచి గౌరవెల్లి ప్రాజెక్టులోకి 4 టీఎంసీల గోదావరి జలాలను తెచ్చి రైతులకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ అధికారులు గౌరవెల్లి ప్రాజెక్టు పనులు చేపట్టారు. ప్రభుత్వం మారడంతో గౌరవెల్లి ప్రాజెక్టు పనులు అక్కడే నిలిచిపోయాయి. రైతులు ఇక మనకు గోదావరి జలాలు రావని నిర్ణయానికి వచ్చి బోర్లు, బావులు తవ్వే ప్రయత్నాలు చేస్తున్నారు.



నీళ్లు లేక పగుళ్లు పట్టి వరి పొలం

భగీరథ ప్రయత్నం

వరి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా కష్టాలు పడుతూ అప్పులు చేసి బోర్లు వేసుకుంటున్నారు. కొందరు రైతులు వాగులు, చెరువుల నుంచి మోటార్ల ద్వారా పంటలకు నీరు అందిస్తున్నారు. చిన్న సన్నకారు రైతులు బావులను పూడిక తీసేందుకు క్రేన్స్‌ను కిరాయిలకు తెచ్చుకొని పనులు చేసుకుంటున్నారు. గతంలో ఉపాధి హామీ పథకంలో ఊట బావుల పూడికతీత పనులు ఉండేది ఇప్పుడు అవి లేకపోవడం రైతులకు అదనపు ఆర్థిక భారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తికాని కాల్వలు..



అసంపూర్తిగా ఉన్న కాల్వ

గౌరవెల్లి ప్రాజెక్టును గోదావరి జలాలతో నింపిన తర్వాత ప్రాజెక్టు కుడి ఎడమ కాల్వల ద్వారా గొలుసు కట్టు చెరువులను నింపి చెరువుల కింది ఆయకట్టు రైతులకు సాగు నీళ్లు అందించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కుడి కాల్వ ద్వారా 22.79 క్యూసెక్‌లు, ఎడమ కాల్వ నుంచి 3.06 క్యూసెక్‌లు సాగు నీళ్లను చెరువులకు వదులతారని రైతులు కోటి ఆశలతో ఎదురు చూసినా అడియాసలే అయ్యాయి. కుడి కాల్వ పూర్తి అయినా ఎడమ కాల్వ పూర్తి కాలేదు. హుస్నాబాద్ డివిజన్‌లో 70 వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తే నీళ్లు లేక పంటలు ఎండిపోవడంతో రైతులు నానా కష్టాలు పడుతున్నారు.

రెండు బోర్లు వేసినా నీళ్లు రాలే..



నాలుగు ఎకరాల మిర్చి పెడితే నీళ్ల కాసే తోటను గొర్రెలకు వదిలేసిన. కళ్ల ముందు కష్టం చేసిన పంట ఎండిపోతుంటే చూడలేక 500 ఫీట్లు, ఒకటి 350 ఫీట్లు రెండు బోర్లు ఏసినా చుక్క నీళ్లు రాలేదు. 23 గజాల లోతు బాయిల నీళ్లు 15 రోజుల్లో పాతాలానికి పడిపోయిన్నాయ్. బోర్ల ఏసిన బాకీ తీర్చడానికి రెండు పాలు ఇచ్చే ఆవులను అమ్మితే అంగట్ల అగ్వకు అడుగితే రూ.60 వేలు వచ్చాయి. మిర్చి అమ్మిన తర్వాత మిగితా బాకీ కట్టి రావాలె.

– జనగామ సంపత్‌రావు, గాంధీనగర్

రైతుల బతుకులు గోదాట్ల ఏసింద్రు



పోయిన వానా కాలంలో గౌరవెల్లి ప్రాజెక్టులకు గోదావరి నీళ్లు తేవడానికి మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ట్రయల్ రన్ చేసింద్రు. నాలుగు రోజులు ప్రాజెక్టులకు నీళ్లు పోస్తే ఇక రైతులకు సాగు నీరు తిప్పలు లేవకున్నాం. అయిపాయే ప్రభుత్వం మారింది ప్రాజెక్టు ముచ్చటలేనే లేదు. పంటలకు నీళ్లు లేక ఎండుతుంటే ఒక నాయకుడు అడిగినోళ్లు లేకపాయే.

– రాంగోపాల్‌రావు, రైతు

సాగుకు నీళ్లు అందించాలి



కెనాల్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- కాల్వల ద్వారా చెరువులు, కుంటలు నింపాలి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దౌల్తాబాద్(దుబ్బాక): రైతులు సాగు చేసిన పంటలకు మల్లన్నసాగర్ కాల్వల ద్వారా నీళ్లు అందించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల పరిధిలోని ముబారస్‌పూర్‌లో పెండింగ్‌లో ఉన్న కెనాలను భూ యజమానులతో మాట్లాడి జేసీబీతో కెనాల్‌ను తవ్వించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా నీళ్లను అందించేందుకు ఇరిగేషన్ అధికారులు పెండింగ్‌లో ఉన్న కెనాల్ పనులను పూర్తి చేయాలన్నారు. పంటలు ఎండిపోకుండా మల్లన్న సాగర్ నుంచి కాల్వల ద్వారా వచ్చే నీళ్లతో చెరువులు, కుంటలు నింపి నీళ్లను అందించే మార్గాన్ని ఇరిగేషన్ అధికారులు చేపట్టాలన్నారు. అనంతరం సూరంపల్లి గ్రామంలోహెయిర్ సెలూన్ ప్రారంభించి, మాచిన్‌పల్లి గ్రామంలో మల్లన్న జాతరకు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, ముబారస్‌పూర్ ఎంపీటీసీ బోటుక తిరుపతి, బండారు దేవేందర్, మాజీ సర్పంచ్‌లు అయ్యంగారి నర్సింహులు, యాదవరెడ్డి, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే దౌల్తాబాద్ మండల కేంద్రంలో 8వ తేదీ నుంచి జరిగే శ్రీ స్వయంభు శంభులింగేశ్వర ఆలయ జాతరకు రావాలని ఎమ్మెల్యేకి ఆలయ కమిటీ చైర్మన్ ఆది వేణుగోపాల్ ఆహ్వాన పత్రికను అందించారు.

తప్పుడు పత్రాలతో ఆస్తి లాక్కున్నారు



నిరసన తెలుపుతున్న సోనిప్రియ

- ప్రశ్నిస్తే చంపుతానంటూ బెదిరిస్తున్నారు
- కలెక్టరేట్ ఎదుట ఓ బాధితురాలు నిరసన

మెదక్ కలెక్టరేట్: అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి నాకు రావాల్సిన ఆస్తిని లాక్కున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఓ బాధితురాలు మెదక్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన తమ్మలి సోనిప్రియ మాట్లాడుతూ.. భర్త శ్రీకాంత్ 2020లో గజ్వేల్ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లు తెలిపారు. భర్త సోదరుడైన తమ్మళి శివలింగం నాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా భర్త పేరున మరణ ధృవీకరణ పత్రం తీసుకొని ఆస్తులు అతడి పేరున రిజిస్టేషన్ చేసుకున్నాడని వాపోయింది. ఈ విషయంపై మూడేళ్లగా తిరుగుతున్నా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శివలింగంను ప్రశ్నిస్తే నన్ను, నా పిల్లలను చంపుతానంటూ బెదిరిస్తున్నాడని వాపోయింది. కలెక్టర్ స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు.

ట్రాక్టర్ తగులబెట్టిన దుండగులు

మిరుదొడ్డి(దుబ్బాక): వ్యవసాయ ట్రాక్టర్‌ను గుర్తు తెలియని దుండగులు దహనం చేసిన ఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు కూచంగారి దుర్గయ్య వివరాల ప్రకారం.. వ్యవసాయ భూమి వద్ద క్రేజ్ వీల్ నిలిపి ఉంచగా రాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాక్టర్ ఇంజన్‌తోపాటు టైర్లను గడ్డి వాములో వేసి తగులబెట్టినట్లు వాపోయారు. మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆయిల్‌పామ్ తోట దగ్ధం

నంగునూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఆయిల్‌పామ్ తోట దగ్ధమైన ఘటన సోమవారం మైసంపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు దుర్గారెడ్డి మూడేళ్ల కిందట ఉపాధి హామీ పథకంలో 171 ఆయిల్‌పామ్ మొక్కలు నాటాడు. ఇటీవలె గెలలు వేయడంతో పంట చేతికొచ్చే దశలో ఉంది. మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి కింద ఉన్న గడ్డి అంటుకోవడంతో డ్రిప్పుతోపాటు చెట్లు కాలిపోయాయి. ఇది గమనించిన రైతులు మంటలు ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి సుద్దాల శ్రీకాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్, రవి కాలిపోయిన మొక్కలను పరిశీలించారు.

కుమారుడిపై తండ్రి కత్తితో దాడి



చికిత్స పొందుతున్న వంశీ

తూప్రాన్: కుమారుడిపై తండ్రి కత్తితో దాడికి పాల్పడిన ఘటన మండలంలోని ఇస్లాంపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన గొల్ల కిష్టయ్య కుమారుడు వంశీ కొన్నేళ్లుగా తాగుడుకు బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. పలుమార్లు మందలించినా ప్రవర్తన మార్చుకోలేదు. విసుగు చెందిన తల్లి గతేడాది విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. అయినా అతడిలో మార్పు లేదు. ఈ క్రమంలోనే వంశీ భార్య సైతం భర్త అలవాట్లు భరించలేక పుట్టినిల్లు నిజామాబాద్ జిల్లా వర్నీకి వెళ్లిపోయింది. కొడుకు ప్రవర్తనతో విసిగిపోయిన తండ్రి కిష్టయ్య, అతడి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్న లక్ష్మణ్‌తో కలిసి సోమవారం ఇంటికొచ్చిన వంశీపై కత్తులతో దాడి చేశారు. చేతికి, కడుపులో తీవ్ర గాయాలు కాగా గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతోపాటు వంశీని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఎస్‌ఐ తెలిపారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని, అందిన వెంటనే కేసు నమోదు చేస్తామన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

ప్రియుడితో కలిసి భర్తను హత్య

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి అటవీ ప్రాంతంలో ఇటీవల జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇందులో ఐదుగురు నిందితులను అరెస్ట్ సోమవారం రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి కార్యాలయంలో వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల దుర్గేశ్ అలియాస్ దుర్గయ్య(28), భార్గవి దంపతులు. ఈమె ఓ కళాబృందంలో కొంతకాలంగా కలిసి నత్యం చేస్తుంది. అక్కడే మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మానేపల్లి గ్రామానికి చెందిన జాల అశోక్‌తో పరిచయం ఏర్పడింది. తరచూ ఇద్దరు కలుసుకోవడంతో భర్త దుర్గేశ్‌కు అనుమానం వచ్చింది. పలుమార్లు భార్గవిని హెచ్చరించి కొట్టాడు. దీంతో భర్తను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని పథకం వేసింది. ప్రియుడు జాల అశోక్ పథకం వేసుకొని ఫిబ్రవరి 29వ తేదీన భర్తను చిప్పల్‌తుర్తి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లింది. అశోక్ తన స్నేహితులు గొల్ల పర్వతాలు, గొల్ల మహేశ్, సంతోష్‌తో కలిసి దుర్గేశ్‌తో అతిగా మద్యం తాగించారు. అనంతరం టీషర్టుతో ఉరివేసి బండరాయితో మోది చంపేశారు. మరుసటి రోజు అటుగా వెళ్తున్న స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు తమదైన శైలిలో భార్యను విచారించగా నేరం ఒప్పుకున్నారు.

రాంగ్ రూట్‌లో వచ్చి.. ఆటోను ఢీకొట్టి

- ద్విచక్రవాహనదారుడి తప్పిదంతో ఆటో బోల్తా
- ముగ్గురికి గాయాలు



ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

కొల్చారం(నర్సాపూర్): ఆటో బోల్తా పడి ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని మెదక్-నర్సాపూర్ జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వడ్ల రంగాచారి ప్రయాణికులను తీసుకొని రామాయపేట మండలం ఝాన్సీ లింగాపూర్‌కు వెళ్తున్నాడు. కిష్టాపూర్ గ్రామ శివారులోని హనుమాన్ బండల్ మలుపు వద్దకు రాగానే బైక్ ఎదురుగా రాంగ్‌రూట్‌లో వచ్చి వీరి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడటంతో డ్రైవర్ రంగాచారికి గాయాలు అయ్యాయి. బైక్‌పై ఉన్న కిష్టాపూర్ గ్రామానికి చెందిన పసుల కుమార్, వెంకటాపూర్ గ్రామానికి చెందిన సుదర్శనంకి కాళ్లు విరిగాయి. ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దశ దినకర్మకు వెళ్లొచ్చేసరికి..

ఇంట్లో చోరీ, బంగారం, వెండి అపహరణ

పటాన్ చెరు టౌన్: ఇంట్లో దొంగలు పడి బంగారం, వెండి ఎత్తుకెళ్లిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాచెరు పట్టణంలోని గోకుల్ నగర్‌కు చెందిన బోడీ భిక్షపతి యాదవ్ భార్య పోచమ్మతో కలిసి సోమవారం ఉదయం జిన్నారం మండల్ వావిలాల గ్రామంలో బంధువు చనిపోవడంతో దశ దినకర్మకి వెళ్లారు. ఉదయం 11 గంటలకు వెళ్లి మధ్యాహ్నం 2:30 గంటలకు తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. భిక్షపతి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని 7.5 తులాల బంగారం, 55 తులాల వెండి దొంగలు చోరీ చేశారు. వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

ఇసుక డంప్‌లు స్వాధీనం



ఇసుక డంప్‌లను చూస్తున్న పోలీసులు

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల మండలంలోని కమలాయపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను సోమవారం ఎస్‌ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ స్వాధీనం చేసుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కమలాయపల్లిలో కొంత మంది ఇసుకను అక్రమంగా నిల్వ చేసి అమ్ముకుంటున్నారని నమ్మదగిన సమాచారం మేరకు ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బెజ్జంకి(సిద్దిపేట) : మండలంలోని గాగిళ్లాపూర్ శివారులోని మోయతుమ్మెద వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్‌పామ్ వైపు అడుగులు

- ప్రోత్సాహంతో రైతుల ఆసక్తి
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా మిర్చి

చిన్నకోడూరు(సిద్దిపేట): వాతావరణ పరిస్థితులు అనుకూలించక పండించిన పంటలకు దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. ఎప్పుడు ఒకే రకమైనవి కాకుండా మారుతున్న కాలానికనుగుణంగా దీర్ఘకాలిక పంటల సాగుకు ఒక్కొక్కరుగా అడుగులు వేస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే 25 ఏళ్ల రాబడి వచ్చే అవకాశం ఉండడంతో రైతులు మొగ్గు చూపుతున్నారు. వివిధ నేలలు ఈ పంట సాగుకు అనుకూలమని గత ప్రభుత్వం గుర్తించి మొక్కల పెంపకం చేపట్టింది. ఎర్రమట్టి, నల్లరేగడి తదితర భూముల్లో దిగుబడి అధికంగా వచ్చే అవకాశం ఉంది. నీటి వసతితోపాటు తేమశాతం అధికంగా ఉండే భూములు ఈ పంటకు అనువుగా ఉంటాయి. ఎకరాకు 50 మొక్కల వరకు నాటవచ్చు. మొక్కల మధ్యలో కూరగాయలు, మిర్చి వంటి ఆరుతడి పంటలు సాగు చేయొచ్చు.

సబ్సిడీ మొక్కలు, నిర్వహణకు సాయం..

ఆయిల్‌పామ్ ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై మొక్కలు అందజేసింది. పంటకు నీటి తడులు అందించడానికి అవసరమయ్యే డ్రిప్ కోసం ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, బీసీలకు 90 శాతం సబ్సిడీపై ఇస్తోంది. ప్రతీ ఏడాది నిర్వహణ కోసం ఎకరాకు రూ. 4,200 చొప్పున నాలుగేళ్ల వరకు అందిస్తోంది. నాలుగేళ్ల తర్వాత పంట దిగుబడి మొదలై ఏటా ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

3,679 ఎకరాల్లో..

సిద్దిపేట నియోజకవర్గంలో 1,132 మంది రైతులు 3,679 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. నంగునూరు మండలంలో 1,631 ఎకరాలు, చిన్నకోడూరు 727, సిద్దిపేట అర్బన్ 377, సిద్దిపేట రూరల్ 496, నారాయణరావుపేట మండలంలో 438 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. సాగుకు ఆసక్తి ఉన్నవారి వివరాలు నమోదు చేసి శిక్షణ ఇస్తున్నారు.

మంచి ఆదాయం



ఆయిల్‌పామ్ సాగు చేస్తే నాలుగేళ్లలో పంట చేతికి వస్తుంది. ఆ తర్వాత దిగుబడి మొదలై ఎకరాకు రూ లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఈ పంటకు డిమాండ్ ఉంది. అడవి జంతువుల బెడద ఉండదు. సాగుకు రైతులు ముందుకు రావాలి.

– భాస్కర్ రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ టెక్నికల్ అధికారి